క్లుప్తంగా

మర్యాదపూర్వక భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ స్వరూప్ విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

ఉచిత బస్సుతో ఇబ్బందులు పడుతున్నాం

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు పథకంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని సర్వేశ్వరపురం దుర్గా భవానీ ఆటో యూనియన్ నాయకులు రాజాన కృష్ణ, తాళాడ తవుడు, కుప్పిలి అప్పారావు, చందక కూర్మారావులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం వారు మాట్లాడుతూ.. ఆటోలతోనే జీవితాలు సాగిస్తున్నామని, వీటిమీద వచ్చిన ఆదాయంతోనే పిల్లలను చదివిస్తున్నామన్నారు. ఇప్పుడు ఉచిత బస్సు అమలు చేయడంతో ఆటోలో ప్రయాణించేవారు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశారు. ఈ మేరకు ఈనెల 28న తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జారజాన గౌరీశంకరరావు, ఉంద్రాల నాగేశ్వరరావు, ఎస్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో సమస్యలు

గార: బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు వస్తాయని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కె.హరిబాబు అన్నారు. మండలంలోని బందరువానిపేట గ్రామంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు వలన బాలికలకు గర్భధారణలో సమస్యలు వస్తాయని, అనారోగ్యంగా పిల్లలు జన్మిస్తారన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలియజేశారు. కార్యక్రమంలో డీసీపీవో కె.రమణ, ఏపీసీ ఎస్.శశిభూషణ్, తహసీల్దార్ ఎం.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణకు డాక్టరేట్

రణస్థలం: మండలంలోని తెప్పలవలస పంచాయతీ పాపారావుపేట గ్రామానికి చెందిన రామకృష్ణ మధ్యవర్తుల వ్యవస్థ – ఏపీలోని శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ మార్కెటింగ్ సమస్యలు, సవాళ్లపై చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్ పొందారు. ఏయూలోని ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తన పరిశోధనలు పూర్తిచేసి వీసీ బీపీ రాజశేఖర్ చేతులమీదుగా పట్టాను అందుకున్నారు. పరిశోధనకు ఏయూ ఆర్థిక శాస్త్ర విభాగపు ప్రొఫెసర్ బి.లిల్లీ గ్రేస్ యూనిస్ మార్గదర్శకత్వం వహించారు. దీంతో రామకృష్ణను పలువురు అభినందించారు.

అట్రాసిటీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి

శ్రీకాకుళం క్రైమ్/శ్రీకాకుళం: దళిత, ఆదివాసీలకు రక్షణ కల్పించే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని, కేసుల నమోదులో జాప్యం జరగకుండా చూడాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను జిల్లా దళిత, ఆదివాసీ సంఘాల జేఏసీ నేతలు కంఠా వేణు, తైక్వాండో శ్రీనులు కోరారు. మంగళవారం జిల్లాకు విచ్చేసిన హోంమంత్రిని కలిసిన వీరు వినతిపత్రం అందించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలు కొలెటరల్ సెక్యూరిటీ లేకుండా సిబిల్ పరిగణలోకి తీసుకోకుండా అందించాలని, భూ కొనుగోలు పథకాన్ని పునరుద్ధరించాలని విన్నవించారు. జనాభా గణన పూర్తయ్యాక జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో వసతులు మెరుగుపర్చి, విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని కోరారు.

హోంమంత్రిని కలిసిన ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకు మంగళవారం విచ్చేసిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సాయుధ పోలీసు బలగాల సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు.

పొంచి ఉన్న ప్రమాదం



బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదకరంగా ఉన్న దిమ్మ

ఎచ్చెర్ల : బైపాస్ రోడ్డు కూడలి ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారి నుంచి పాలిటెక్నిక్ కాలేజీకి వెళ్లే దారిలో ధాబాల సమీపంలో రథసప్తమి ఉత్సవాల సమయంలో దిమ్మ ఏర్పాటు చేసి అలాగే వదిలేశారు. దీనికితోడు అదే ప్రాంతంలో గోతులు ఏర్పడటంతో అందులో వర్షపు నీరు చేరి ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా రాత్రివేళల్లో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఏకదంతుడి ఆగమనం

- మొదటి పూజకు సిద్ధమైన భక్తజనం
- ముమ్మరంగా ఏర్పాట్లు
- వర్షం వలన వ్యాపారాలకు ఇబ్బందులు

శ్రీకాకుళం కల్చరల్: గణపతి నవరాత్రులు బుధవారం నుంచి ప్రారంభమవ్వనుండడంతో మంగళవారం నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్, రైతు బజారు మార్కెట్లు సందడిగా మారాయి. అయితే రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో చవితికి కావాల్సిన సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా పెద్ద మార్కెట్లలో ఒకటైన రైతు బజారు రెండు రోజుల వర్షాల కారణంగా నీటిలో మునిగిపోయింది. దీంతో కొనుగోలుదారులు మోకాలు లోతు నీటిలో లోపలికి వెళ్లాల్సి వచ్చింది. కళింగరోడ్డు నుంచి పెద్ద మార్కెట్‌కు వెళ్లే రహదారి పొడవునా వినాయక ప్రతిమలు, పూజించేందుకు పత్రి, మామిడి ఆకులు, పువ్వులు, పండ్లు కొనుగోళ్ల కోసం ప్రజలు పోటీపడ్డారు.

మట్టి విగ్రహాలు పంపిణీ

ఎచ్చెర్ల: మండలంలోని చిలకపాలేంలో ఉన్న శివానీ కాలేజీలో మంగళవారం ఉదయం మట్టి గణపతి విగ్రహాలను శివానీ గ్రూప్ ఆఫ్ కాలేజీ సిబ్బందికి కళాశాల ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీటీ చంద్రశేఖర్‌లు సిబ్బందికి విగ్రహాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజ్‌కిరణ్, డిప్లమా ప్రిన్సిపాల్ ఎస్‌వీఎన్ సునీల్ కుమార్, ఎంబీఏ హెచ్‌వోడీ కె.రవికుమార్, టీపీవో బి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

30 వేల మట్టి విగ్రహాలు పంపిణీ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు కూడళ్ల వద్ద పర్యావరణ శాఖ, క్రిడై సహకారంతో 30 వేలకు పైగా మట్టి విగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఇలిసిపురం కూడలి వద్ద హర్షవల్లి లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు, హారికా కన్‌స్ట్రక్షన్స్ అధినేత హారికా ప్రసాద్ ఆధ్వర్యంలో ఏసీబీ సీఐ కె.భాస్కర్ చేతులమీదుగా 3 వేల మట్టి వినాయక ప్రతిమలు, వ్రత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీహార్, హారిక, శోభారాణి, సుమన్, లక్ష్మణ్, జేఎస్టీ నాయుడు, మణిశర్మ, ఉషారాణి, కుమార్, సాగర్, కిశోర్, స్వీప్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోష్ట గ్రామంలో...

రణస్థలం: మండలంలోని కోష్ట గ్రామంలో హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ, పైడిభీమవరంలో మీకోసం సేవా సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయకుడి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. తహసీల్దార్ సనపల కిరణ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను పూజించాలని తెలిపారు. కార్యక్రమంలో హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు ఆర్.హరిబాబు, మీకోసం సేవా సంఘం అధ్యక్షుడు వడ్డాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: మట్టి విగ్రహాలను పంచుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

వ్యాపారాలకు వర్షం ఇబ్బందులు

జి.సిగడాం/రణస్థలం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వలన చవితి వ్యాపారాలు మందగించడంతో వ్యాపారులకు ఇబ్బందులు తప్పలేదు. భారీ వర్షం కారణంగా కొనుగోళ్లు చేసేందుకు ప్రజలు బయటకు రాకపోవడంతో నిరాశ ఎదురైంది. కాగా మరోవైపు మార్కెట్‌లో పూజా సామగ్రి ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో నామమాత్రంగానే సామాగ్రి కొనుగోలు చేస్తున్నారు.

ముస్తాబవుతున్న మండపాలు

శ్రీకాకుళం కల్చరల్: వినాయక చవితి ఉత్సవాలు పురస్కరించుకొని నగరంలోని పలు వీధుల్లో వినాయక మండపాలను పోటాపోటీగా తీర్చిదిద్దుతున్నారు. ఆధునిక హంగులతో పాటుగా మండపాలు ఆలయాన్ని తలపించేవిధంగా సెట్స్ వేస్తున్నారు. వీటితో పాటుగా విద్యుత్ బల్బులతో పాటుగా ప్రత్యేక లైటింగ్ ఎఫెక్ట్స్‌ను కూడా పెడుతున్నారు. రైతు బజారు వద్ద 15 అడుగుల వినాయకుడిని ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కత్తెరవీధిలోని మెహెర్ నగర్ వద్ద 18 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అందుకు తగిన సెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పూజలకు వినాయకుడి ఆలయాలు సైతం సిద్ధమయ్యాయి. పాలకొండ రోడ్డులో ఉన్న విజయ గణపతి ఆలయం, మొండేటివీధిలోని లక్ష్మీ గణపతి ఆలయం, మంగువారితోటలో ఉన్న సంపత్ వినాయక ఆలయం, పీఎన్‌కాలనీలో ఉన్న వరసిద్ధి వినాయక ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆకట్టుకున్న చిన్నారులు



వినాయక విగ్రహాలకు బదులుగా పచ్చని ఆకులతో వినాయక రూపాలను తయారు చేశారు. చెట్టు నుంచి ఆకులు తీసుకొచ్చి వాటిని వినాయకుడి ఆకారంలో తీర్చిదిద్దారు. మండలంలోని పెంట గ్రామానికి చెందిన సింహాద్రి లీలా మోహన్ కుమార్తె, కుమారులు సాద్విక్, నందులు ఇలా తయారు చేశారు.

– జి.సిగడాం



ఎచ్చెర్ల: మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్న దృశ్యం



రణస్థలం: పైడిభీమవరంలో పంపిణీ చేస్తున్న తహసీల్దార్ కిరణ్ కుమార్ తదితరులు



జి.సిగడాం: కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న వ్యాపారులు



రణస్థలంలో వర్షంతో వెలవెలబోతున్న మార్కెట్లు



శ్రీకాకుళం కల్చరల్: జెడ్పీ వద్ద వేంకటేశ్వరస్వామి ముఖద్వారం సెట్



శ్రీకాకుళం కల్చరల్: రైతు బజారు వద్ద 15 అడుగుల విగ్రహం కోసం ఏర్పాటు చేస్తున్న సెట్



శ్రీకాకుళం కల్చరల్: హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన మండపం

సంక్షిప్తంగా...

వేణుగోపాలంకు అభినందనలు

శ్రీకాకుళం న్యూకాలనీ: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన పైడి వేణుగోపాలం అభినందన సభను నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ.. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసిన వ్యక్తి వేణుగోపాలం అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జి విజయానందరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శవ్వాన ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కుందనకు ఎంబీబీఎస్ సీటు

శ్రీకాకుళం: నగరానికి చెందిన పైల కుందన కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఇటీవల ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ కేటాయించిన సీట్లలో ఆమెకి గుంటూరులోని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో సీటు దక్కింది. భవిష్యత్‌లో మంచి డాక్టర్‌గా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే తన లక్ష్యమని కుందన చెబుతోంది. ఆమెను పలువురు అభినందించారు.

రెయిన్ కోట్లు వితరణ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డి నారాయణరావు మంగళవారం రెయిన్ కోట్లు అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులంతా వర్షంలో తడుస్తూ పని చేస్తుండడంతో 12 మందికి అందజేశారు.

సత్తాచాటిన కల్యాణ్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన ఆరంగి కల్యాణ్ సత్తాచాటాడు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆర్చరీ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈనెల 29వ తేదీన సీఎం చంద్రబాబు చేతులమీదుగా మెడల్ అందుకోనున్నట్లు డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్‌రావు తెలిపారు. కోచ్ మధు, సంఘ కార్యదర్శి ఎల్.చిట్టిబాబు, అకాడమీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

మండల సాధనకు కృషి చేయాలి

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక మండల సాధన కమిటీ సభ్యులు మంగళవారం ఎచ్చెర్ల మండలంలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులను కలిసి లావేరు మండల సాధనకు కృషి చేయాలని కోరారు. అజ్జరాం, కుప్పిలి, బుడగట్లపాలేం తదితర గ్రామాల తాజా, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కలిసి మురపాక మండల సాధన ఆవశ్యకతను వివరించారు. మండల ఏర్పాటు విషయం గ్రామస్తులతో చర్చించి తమ అభిప్రాయాలను తెలియజేస్తామని ఆయా ప్రతినిధులు సాధన కమిటీకి తెలిపారు.

నిరాశ్రయులకు అన్నవితరణ

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గొంటివీధిలోని నైట్ షెల్టర్‌లో ఉన్న నిస్సహాయకులకు వీరఘట్టం ప్రభుత్వ బాలికల పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న బలివాడ స్వాతి తన పుట్టినరోజు పురస్కరించుకొని మంగళవారం అన్నవితరణ చేశారు. కార్యక్రమంలో ఉర్లం శివతేజ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

రణస్థలం: మండలంలోని నారువ గ్రామంలో మదర్ థెరిస్సా జయంతి పురస్కరించుకొని పంచాయతీ మాజీ సర్పంచ్ నిద్రబంగి రామకృష్ణ సుమారు 100 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. దీంతో ఆయనను అందరూ అభినందించారు.

ముంచెత్తిన వాన

జిల్లాలో మంగళవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. ఏకధాటిగా కురిసిన వానతో పంట పొలాలు, వీధులు, రోడ్లు ముంచెత్తాయి. దీంతో వ్యాపారాలు, రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పొలాల్లోకి వర్షపు నీరు చేరడంతో పలుచోట్ల పంటలు నీటమునిగాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

– సాక్షి నెట్‌వర్క్



గార: సతివాడ – శాలిహుండం మధ్య ముంపునకు గురైన పంటపొలాలు



శ్రీకాకుళం రూరల్: పెదపాడు గాంధీనగర్‌లో ముంచెత్తిన వరద నీరు



గార: కళింగపట్నం కంద్రవీధిలో నీరు నిలిచి ఉన్న దృశ్యం



రణస్థలం: చెరువును తలపిస్తున్న కొచ్చెర్ల రోడ్డు



జల దిగ్బంధంలో జాతీయ రహదారి



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి చేరిన వరదనీరు



జలమయమైన పీఎన్ కాలనీ రెండో లైన్